

హైకోర్టుకాలనీ ముఖద్వారం పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కాలనీల అభివృద్ధికి కృషి అభినందనీయం

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఐక్యమత్యంగా ఉంటూ కాలనీల అభివృద్ధికి కృషిచేయడం అభినందనీయమని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం హయత్‌నగర్ డివిజన్ హైకోర్టుకాలనీ ముఖద్వారపు పనులకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కాలనీవాసులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీవాసులు తమ కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషిచేయడంతో పాటు కాలనీల అభివృద్ధికి ముందుకు రావడం శుభపరిణామం అన్నారు. కాలనీల్లో ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసి మెలిసి జీవిస్తూ ముందుకు సాగాలన్నారు. కాలనీముఖద్వార పనులను నాణ్యతతో చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, దీపావళి శ్రవణ్‌కుమార్, నక్క వెంకటస్వామియాదవ్, లక్మారెడ్డి, కెఎల్ఎన్‌రావు పాల్గొన్నారు.

కుంగిన ట్రంకు లైనును పరిశీలించిన సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లో భారీ వర్షానికి విజయవాడ జాతీయ రహదారి పక్కన హయత్‌నగర్ వీరభద్రనగర్‌కాలనీ కల్వర్టు వద్ద కుంగిన 1200 డయా ట్రంకు లైనును శుక్రవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ రోడ్డు విస్తరణ పనులు నత్త నడకన జరుగుతున్నాయని అన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. జాతీయ రహదారికి సర్వీస్ రోడ్లను కలిపి సరియైన రోడ్డు లేక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, డీఈఈ బాలునాయక్, జలమండలి, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ధోబీఘాట్‌లను పునరుద్ధరించండి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 5వ వార్డు పరిధిలో శిథిలావస్థకు చేరుకున్న ధోబీఘాట్‌ల పునరుద్ధరణకు చర్య లు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకుడు పిల్లి శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో గురువారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ధోబీఘాట్‌తో పాటు స్నానాల గదులు, మరుగుదొడ్లు లాంటి వసతులు కల్పించాలని కోరారు. రజకులకు కొత్త ధోబీ కార్డులను మంజూరు చేయాలన్నారు. సమస్యలపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కారం చూపించాలని విజ్ఞప్తి చేశారు. శిథిలావస్థకు చేరిన ధోబీఘాట్‌లతో కుల వృత్తిని కొనసాగించలేక పోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు ముదిగొండ రమేష్, హరిబాబు, ఈశ్వరయ్య, కుమార్, శ్యాం, మల్లేష్ పాల్గొన్నారు.

రేషన్ కార్డుల మంజూరు పత్రాలు పంపిణీ

సరూర్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ 8,9,27వ డివిజన్లకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన కొత్త రేషన్ కార్డులకు సంబంధించిన మంజూరు పత్రాలను శుక్రవారం యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు వల్లపు సుభాన్‌యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక ఇందిరమ్మ కమిటీ సభ్యులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాదర్‌గుల్ మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కందాడి శ్రీరాంరెడ్డి పాల్గొని మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేక పోయిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు మంజూరు చేస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పుట్టగల్ల జగన్, యెలకొండ శ్రీధర్‌రెడ్డి, బంగారు అశోక్, జెనిగె వెంకటేశ్‌యాదవ్, యాతం మహేందర్‌యాదవ్, రజిత పాల్గొన్నారు.

ప్రజలు ఇబ్బందులు పడొద్దు: కార్పొరేటర్ నర్సింహారెడ్డి


మన్సూరాబాద్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఎంతటి పెద్ద వర్షం కురిసినా ప్రజలు ఇబ్బందులు పడకుండా జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షం కారణంగా శుక్రవారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలను సందర్శించిన కార్పొరేటర్ అక్కడి సమస్యలను తెలుసుకుని పరిష్కార చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మురుగు సమస్యతో సతమతమవుతున్న వీకర్‌సెక్షన్ కాలనీలో రూ.80లక్షలతో వరదనీటి నాలాను త్వరలోనే ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు.



వరద ఉధృతికి ధ్వంసమైన రోడ్డు ప్యాచ్‌వర్క్, మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

మరమ్మతు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కొత్తపేట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వరద ముంపు ప్రాంతాల్లో మరమ్మతు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్థానిక కార్పొరేటర్ పవన్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని గాయత్రీపురం, నాగేశ్వర్‌నగర్‌కాలనీ, ఎస్ఆర్ఎల్‌కాలనీ, రాఘవేంద్రకాలనీ, సత్యానగర్, మారుతీనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పాత ఆంధ్రాబ్యాంక్ ఏటీఎం వద్ద గాయత్రీపురం - ఎస్ఆర్ఎల్‌కాలనీ దారిలో వరద ఉధృతికి ధ్వంసమైన రోడ్డు ప్యాచ్‌వర్క్ మరమ్మతు పనులను పరిశీలించారు. జూలై 26న ఎస్ఆర్ఎల్‌కాలనీలో ఓ ఇంటి ముందు ర్యాంపు వద్ద వరదనీటి కాల్వపై కప్పు కూలింది. ఇటీవలి వర్షాల కారణంగా అక్కడ మరమ్మతు పనుల్లో జాప్యం చోటుచేసుకుంది. శుక్రవారం పునరుద్ధరించిన ఆ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సత్యానగర్ రోడ్ నెం.14లో ఉండే ప్రైవేటు ఉద్యోగి ప్రమోద్‌కుమార్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ షరీఫ్, ఎస్ఆర్ఎల్ కాలనీ అధ్యక్షుడు సుధాకర్ పాల్గొన్నారు.



డబీర్‌పురలో కూలిన చెట్లతో నిలిచిన విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్న చాదర్‌ఘాట్ సబ్‌స్టేషన్ విద్యుత్ సిబ్బంది

మలక్‌పేటలో తొమ్మిది విద్యుత్ ఫీడర్లు ట్రిప్పు

●రాత్రికి రాత్రే పునరుద్ధరించిన విద్యుత్ అధికారులు

చాదర్‌ఘాట్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ డివిజన్ పరిధిలోని తొమ్మిది విద్యుత్ ఫీడర్లు ట్రిప్పు అయ్యాయి. అందులో ఏడు విద్యుత్ ఫీడర్లను వెంటనే పునరుద్ధరించడంతో విద్యుత్ సరఫరా మెరుగుపడింది. సైదాబాద్ సరస్వతీనగర్, చాదర్‌ఘాట్ సబ్‌స్టేషన్ పరిధిలోని డబీర్‌పుర ఫీడర్ల పరిధుల్లో చెట్లుకూలి కొమ్మలు విరిగిపడడంతో విద్యుత్ తీగలు తెగిపోయినట్లుగా విద్యుత్ సిబ్బంది గుర్తించారు. ఆస్మాన్‌ఘడ్ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, చాదర్‌ఘాట్ ఏఈ ప్రసాద్‌తో పాటు సీబీడీ, సెక్షన్లలో పనిచేసే మరో పది మంది సిబ్బందితో చేరుకుని విద్యుత్ తీగలను బిగించి విద్యుత్ సరఫరాను గురువారం రాత్రి పునరుద్ధరించారు.





వాసవీకాలనీలోని అష్టలక్ష్మీ ఆలయంలో అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు, సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న భక్తులు



శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గమ్మకు పూజలు చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్ తదితరులు

ఆలయాలు కిటకిట

సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

ఎల్బీనగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయాలకు భక్తులు బారులుతీరారు. శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున దేవాలయాలకు చేరుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. కొత్తపేటలోని అష్టలక్ష్మీ ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామున చతుస్థానార్చన, నిత్యహవనములు నిర్వహించారు. అనంతరం నూతన ధ్వజ స్తంభ యంత్ర ప్రతిష్ఠాపన అనంతరం ధ్వజ స్తంభ పునఃస్థాపన చేశారు. ఆదిలక్ష్మి సమేత శ్రీమన్నారాయణస్వామికి నవకలశ స్నపనం నిర్వహించారు. అష్టలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామి, నూతన ధ్వజస్తంభానికి, ఆలయ మండపములకు, పవిత్ర సమర్పణ, నిత్య పూర్ణాహుతి చేశారు. సాయంత్రం హయగ్రీవ జయంతి సందర్భంగా విద్యాభివృద్ధి కోసం హయగ్రీవ స్తోత్ర పారాయణం చేశారు. సాయంత్రం నిత్యహవనములు, పూర్ణాహుతి అనంతరం సామూహిక వరలక్ష్మీ వ్రతములు చేశారు. వరలక్ష్మీ వ్రతములో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ప్రత్యేక పూజల్లో ఆలయ చైర్మన్ సోమ సురేష్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, ఫౌండర్ చైర్మన్లు చంద్రశేఖర్‌గుప్తా, సుధాకర్‌గుప్తా, కార్యదర్శి దాచేపల్లి శ్రీనివాస్, కమిటీ సభ్యులు చిలుక ఉపేందర్‌రెడ్డి, మాలే అనిల్, శ్రీనివాస్, ఉమాపతి పాల్గొన్నారు.



వరలక్ష్మీ అవతారంలో కొలువుదీరిన సైదాబాద్ మాతా మైదానంలోని విజయ దుర్గామాత కొత్త కరెన్సీ నోట్లతో ప్రత్యేక అలంకరణ

నాగోల్, మన్సూరాబాద్‌లలో..

మన్సూరాబాద్: వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని శుక్రవారం నాగోల్, మన్సూరాబాద్ డివిజన్ల పరిధిలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా అమ్మవారు వరలక్ష్మీగా దర్శనమివ్వడంతో ఆయా ఆలయాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులు విశేష పూజలు చేశారు.

శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో..

శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీవ్రతం పర్వదినాన్ని పురస్కరించుకుని నాగోల్ డివిజన్ పరిధి మన్సూరాబాద్ శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయంలోని అమ్మవారు భక్తులకు లక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్ ఆధ్వర్యంలో దుర్గమ్మను రూ.పది నాణెములతో విశేషంగా అలంకరించారు. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని శుక్రవారం తన నివాసంలో ప్రతిష్ఠించిన అమ్మవారికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా సతీమణి ఉప్పల స్వప్న, కుమారులు, కోడలితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.



వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన దిల్‌సుఖ్‌నగర్‌లోని సంతోషిమాత అమ్మవారు



కాశీవిశాలాక్షి అమ్మవారికి ఆకట్టుకున్న రకరకాల పండ్లతో అలంకరణ

కొత్తపేట: కొత్తపేట డివిజన్ పరిధిలోని ఓల్డ్‌విలేజీ, సత్యానగర్, ఎస్ఆర్ఎల్‌కాలనీ, మోహన్‌నగర్, ఎస్‌బీహెచ్‌కాలనీ, స్నేహపురి కాలనీల్లోని భక్తాంజనేయ స్వామి ఆలయం, హరిహరక్షేత్రం, పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయం, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాల్లో శుక్రవారం విశేష పూజలు, అభిషేకాలు, అర్చనలు, సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. స్నేహపురి కాలనీలోని గోదా సమేత పద్మావతీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకం చేశారు.

చేనేత సంక్షేమానికి మోదీ ప్రభుత్వం కృషి: ఎంపీ ఈటల

వనస్థలిపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): దేశంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారి అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషి చేస్తున్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీజేపీ చేనేత రంగారెడ్డి అర్బన్ జిల్లా కన్వీనర్ బొమ్మ రఘురామ్ నేత ఆధ్వర్యంలో గురువారం రాత్రి చేనేత దినోత్సవాన్ని వనస్థలిపురంలోని కర్నాటి గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఐఏఎస్ చిరంజీవులతో కలిసి మాట్లాడారు. విదేశీ మోజులో పడి చేనేత దుస్తులను ఎవరు ధరించడం లేదని, దీంతో చేనేత కార్మికులు జీవనోపాధి కోసం వలసలు వెళ్తున్నారన్నారు. చేనేత కార్మికుల కష్టాలను గమనించిన ప్రధాని మోదీ చేనేతలను ఆదుకోవాలనే సంకల్పంతో అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టారన్నారు. అందులో భాగంగానే ముద్ర పథకం కింద కేంద్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు రుణాలను అందించి ఆదుకుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేనేత వస్త్రాలను విదేశాలకు పంపించే అవకాశం ప్రధాని మోదీ కల్పించారని ఆయన గుర్తు చేశారు. చేనేతల సంక్షేమానికి గతంలోని ఏ ప్రభుత్వం కృషి చేయలేదని, మోదీ ప్రధానమంత్రి అయ్యాకే కేంద్ర ప్రభుత్వం చేనేతలకు అండగా ఉంటుందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సరైన సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రతి ఒక్కరూ చేనేతలకు అండగా ఉండడం కోసం తప్పనిసరిగా చేనేత వస్త్రాలను ధరించాలని సూచించారు. అనంతరం చేనేత మగ్గాన్ని కాసేపు ఎంపీ నేశారు. కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు లచ్చిరెడ్డి, నర్సింహారెడ్డి, నాయకులు కర్నాటి ధనుంజయ్య, రవీందర్‌గౌడ్, పుల్గం రాములునేత పాల్గొన్నారు.



చేనేత మగ్గాన్ని నేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, బొమ్మ రఘురామ్ నేత

మహిళను నిర్బంధించి నగలు, నగదు దోపిడీ

చాదర్‌ఘాట్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఇంట్లో వంట చేస్తున్న మహిళను గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు నిర్బంధించి నగలు, నగదు దోచుకునిపోయిన సంఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చంపాపేటలోని కటికోనికుంట నివాసి దిశితుల వరలక్ష్మి శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో వంట చేస్తుంది. ఇంతలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె ఇంట్లోకి ప్రవేశించారు. ఆమె మెడలోని 4తులాల మంగళసూత్రం, మరో 4తులాల బంగారు గాజులు, కొంత నగదు దోచుకుని పారిపోయారని బాధితురాలు వరలక్ష్మి సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి

మన్సూరాబాద్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బీజేపీ గెలుపునకు బీహార్, మహారాష్ట్ర ఎన్నికల్లో దళితులు, మైనారిటీల ఓట్లను ఎన్నికల కమిషన్ ఆ పార్టీతో కుమ్మక్కై తొలగించిందని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ఆరోపించారు. తొలగించిన ఆ ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎల్బీనగర్ చౌరస్తాలో సీపీఎం సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో, నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పగడాల యాదయ్య మాట్లాడుతూ బీజేపీకి తొత్తుగా మారిన కేంద్ర ఎలక్షన్ కమిషన్ బీహార్‌లో బీజేపీ గెలుపునకు ఏకంగా 64లక్షల ఓట్లను తొలగించిందని ఆరోపించారు. ప్రధాని మోదీ పాలనలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో ప్రజాస్వామ్యాన్ని, హక్కులను, రాజ్యాంగాన్ని కూనీ చేస్తోందని, రానున్న రోజుల్లో బీజేపీకి దేశ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని జోష్యం చెప్పారు. ఎలక్షన్ కమిషన్ బీజేపీ కమిషన్‌గా కాకుండా ప్రజల కమిషన్‌గా ఉండాలని, లేకుంటే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పొట్టేపాకు రామస్వామి, మంతాని యాదయ్య, భూషరాజు కాశయ్య, బి.పురుషోత్తంచారి, దండు రాధ, పి.లక్ష్మయ్య, కుంటిగొల్ల రాములు, రాధమ్మ, గంగమ్మ, కుక్కమూడు వెంకటయ్య, ఎన్.లక్ష్మణ్, ఈదయ్య, సైదులు పాల్గొన్నారు.



ఎలక్షన్ కమిషన్ వైఖరిని నిరసిస్తూ రాస్తారోకో చేపడుతున్న సీపీఎం నాయకులు

కుంగిన ట్రంకు లైనుకు తాత్కాలిక మరమ్మతులు

హయత్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి విజయవాడ జాతీయ రహదారి పక్కన హయత్‌నగర్ వీరభద్రనగర్‌కాలనీ కల్వర్టు వద్ద కుంగిన ట్రంకులైనుకు జలమండలి అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేశారు. శుక్రవారం ఉదయం హెచ్ఎండబ్ల్యూఎస్ హయత్‌నగర్ డివిజన్ మేనేజర్ రాజు, స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ జి. శ్రీనివాస్‌కుమార్‌యాదవ్, ట్రాఫిక్ సీఐలు గట్టు మల్లు, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్, ఆర్అండ్‌బీ డీఈఈ బాలునాయక్ కుంగిన కల్వర్టు వద్దకు చేరుకున్నారు. కుంగిన ట్రంకు లైనుకు అధికారులు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించారు. జాతీయ రహదారి విస్తరిస్తుండడంతో మరో మారు రోడ్డు కింద నుంచి ఉన్న ట్రంకులైను, తాగునీటి పైపులైను వ్యవస్థలకు శాశ్వత మరమ్మతులు చేసి వ్యవస్థను బాగు చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. స్థానిక కాలనీల నుంచి రహదారికి కనెక్టివిటి కల్పించేందుకు బీటీ రోడ్లు నిర్మించాలని పలు కాలనీలవాసులు అధికారులకు వివరించారు. వర్షాల వేళ జీహెచ్ఎంసీ, జలమండలి, హైడ్రా, పోలీస్‌శాఖ, విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.



వీరభద్రనగర్‌కాలనీ కల్వర్టు వద్ద కుంగిన ట్రంకులైనుకు తాత్కాలిక మరమ్మతులు చేసిన జలమండలి అధికారులు

లైసెన్సులు లేకుండా వ్యాపారం నిర్వహిస్తే చర్యలు తప్పవు

● బడంగ్‌పేట్ ఏఎంసీ జాన్‌కృపాకర్ హెచ్చరిక

● సిబ్బందితో కలిసి వ్యాపార సంస్థల్లో తనిఖీలు

సరూర్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో లైసెన్సులు లేకుండా వ్యాపారాలు నిర్వహించే యజమానులపై మునిసిపల్ చట్టం ప్రకారం చర్యలు తప్పవని బడంగ్‌పేట్ అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్ జాన్‌కృపాకర్ హెచ్చరించారు. పలువురు వ్యాపారులు కార్పొరేషన్ నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా వ్యాపారాలు కొనసాగిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి సంస్థలకు పెద్ద మొత్తంలో జరిమానాలు విధించాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కమిషనర్ సరస్వతి ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన వార్డు ఆఫీసర్లు, ఇతర సిబ్బందితో కలిసి కార్పొరేషన్ పరిధిలోని పలు వ్యాపార సంస్థలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారి లైసెన్సులను పరిశీలించారు. లైసెన్సుల గడువు ఇంకా ఉందా.. లేక ముగిసిందా? వంటి అంశాలను పరిశీలించారు. వ్యాపారాలను క్రమబద్ధీకరించి కార్పొరేషన్‌కు ఆదాయం సమకూర్చేందుకుగాను వంద రోజుల ప్రణాళికలో ఈ అంశాన్ని చేర్చినందున తాము తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఏఎంసీ తెలిపారు. అక్రమంగా వ్యాపారం చేస్తే వాటిని మూసివేయిస్తామని, జరిమానా సైతం విధిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వి.యాదగిరి, డీఈఈ వెంకన్న, వార్డు ఆఫీసర్ శంకర్ పాల్గొన్నారు.



వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏఎంసీ జాన్‌కృపాకర్, వార్డు ఆఫీసర్లు

సీపీఐ బలోపేతానికి కార్యాచరణ : జంగయ్య

ఎల్బీనగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలో సీపీఐ బలోపేతానికి కార్యాచరణ రూపొందించి ఆ దిశగా చర్యలు చేపడతామని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శిగా మూడో సారి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా జంగయ్యను సీపీఐ శంకర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్-1 శాఖల కార్యదర్శులు జిల్లెల కృష్ణ, ఎండీ మహబూబ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజాఉద్యమాలు చేపట్టడం ద్వారా పార్టీని విస్తరిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, ఎండీ ఫైమిద, జిల్లా కార్యవర్గసభ్యులు నర్సింహ, ఇద్రిస్‌బాయ్, శ్యామలమ్మ, భాగ్య పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డ పెళ్లికి చేయూత

మన్సూరాబాద్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పేద కుటుంబానికి చెందిన ఓ ఆడ బిడ్డ వివాహానికి ఉప్పల ఫౌండేషన్ ద్వారా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా రెండో కుమారుడు ఉప్పల సాయితేజ చేయూతనందించాడు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం వావిలాల గ్రామానికి చెందిన గుండా తిరుపతయ్య, విజయలక్ష్మిలు నిరుపేద ఆర్యవైశ్య కుటుంబీకులు. ఈ దంపతుల కుమార్తె శ్వేతకు వివాహం నిశ్చయమైంది. విషయం తెలుసుకున్న ఉప్పల సాయితేజ శుక్రవారం నాగోల్‌లోని ఉప్పల క్యాంపు కార్యాలయంలో శ్వేతకు ఆమె తండ్రి తిరుపతయ్య సమక్షంలో పుస్తె, మెట్టెలు, చీరగాజులు అందించారు.

పోలీసులకు రాఖీ కట్టిన విద్యార్థినులు

హయత్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాఖీ పండగను పురస్కరించుకుని శుక్రవారం పెద్దఅంబర్‌పేట్‌లోని సైరస్ ది రైజింగ్ స్కూల్ విద్యార్థులు హయత్‌నగర్ పోలీసులకు రాఖీ కట్టి మిఠాయిలు తినిపించి సోదరభావాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్, ఎస్ఐలు నర్సింహ, వెంకట్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, రాజేశ్వర్, అరుణ్, ఏఎస్ఐ కృష్ణ, ఎస్బీ కృష్ణతో పాటు పాఠశాల చైర్మన్ స్నేహ, డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సాయిలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో విజేత 'తుర్కయంజాల్'

హయత్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్, ఆదిబట్ల మున్సిపాలిటీల మధ్య జరిగిన క్రికెట్ పోటీల్లో తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఘన విజయం సాధించి కప్ కైవసం చేసుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి కప్‌ను తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, క్రికెట్ సభ్యులతో కలిసి అందుకున్నారు. ఆదిబట్ల కమిషనర్ బాలకృష్ణ, తుర్కయంజాల్ డీఈఈ భిక్షపతి, ఏఈ చంద్రశేఖర్‌రెడ్డి, దినేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాగో తెలంగాణ యాత్ర ప్రారంభం

హయత్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగీర్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం హయత్‌నగర్ అంబేడ్కర్ వద్ద నుంచి జాగో తెలంగాణ యాత్రను రాష్ట్ర అధ్యక్షుడు జయరాజ్ ప్రారంభించారు. 2029 ఎన్నికల్లో టీజేఎఫ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ఈ యాత్రను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. యాత్రను జనగామ జిల్లా కేంద్రం వరకు చేట్టి నవంబర్ 23న బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవికుమార్, రాముయాదవ్, బాబాపాషా, నరేష్‌రెడ్డి, నరేష్, ఆంజనేయచారి పాల్గొన్నారు.

హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడిగా చంద్రమోహన్‌రెడ్డి

చంపాపేట: అగ్రికల్చర్ డిపార్టుమెంట్ ఎంప్లాయీస్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడిగా గౌని చంద్రమోహన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హస్తినాపురం డివిజన్‌లోని అగ్రికల్చర్‌కాలనీలోని సంక్షేమ సంఘం భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుల సమావేశంలో హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడిగా గౌని చంద్రమోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా జగత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గురువారెడ్డి, కోశాధికారిగా చంద్రశేఖర్‌శాస్త్రీ, మరో ఐదుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

మత్తు ట్యాబ్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

చంపాపేట : డాక్టర్ సిఫారసు లేకుండా గుట్టు చప్పుడుగా మత్తు కలిగించే ట్యాబ్లెట్లను విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సంతోష్‌నగర్ గుల్షాన్ ఎక్బాల్‌కాలనీకి చెందిన జూబేద్ ఉల్లాఖాన్(37) అనే వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా టెంటాడోల్ ట్యాబ్లెట్లను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. డాక్టర్ సలహా ప్రకారం కొంత మంది శరీరంలో నొప్పులకు వినియోగించే ట్యాబ్లెట్లను నీళ్లలో నానబెట్టి సిరంజీ ద్వారా నరాల ద్వారా శరీరంలోకి తీసుకుంటూ ఉపశమనం పొందుతున్నారు. కంచన్‌బాగ్ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ ఆధ్వర్యంలో హఫీజ్‌బాబానగర్‌లోని మిరాజ్ హోటల్‌లో జూబేద్ ఉల్లాఖాన్ మత్తుకు బానిసలైన కొందరికి ట్యాబ్లెట్లను విక్రయిస్తుండగా పట్టుకున్నారు. ఒక్కో షీట్ ట్యాబ్లెట్లను 3నుంచి 4వందల వరకు అతను విక్రయిస్తున్నట్లు, అతని నుంచి 170 టెంటాడోల్ ట్యాబ్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసునమోదు చేసి అరెస్టుచేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.